# ఆమె తీర్పు

టెలిఫోన్ మ్రోగుతోంది...లాంగ్ కాల్...

ఒక్క ఉదుటన సునీత మంచం మీద నుంచి లేచింది. కార్డ్‌లెస్ అందుకొని ఆన్ చేసింది. అది అమెరికానుంచి. సరిగ్గా రెండు నెలల క్రితం వివాహం చేసుకున్న భర్త రవీంద్ర నుంచి!

"హలో!" హుషారుగా అన్నది.

"నేను రవీంద్రను మాట్లాడుతున్నాను!"

ఉదయం పదకొండు గంటలు. కిటికీలోనుండి పడుతున్న ఎండ చురుక్కు మంటున్నా ఆ మాట వింటూనే ఏసీ ఆన్ చేసినంత ఆనందాన్ని పొందింది.

"తెలుసు... తెలుసు... ఇది మీనుండేనని నాకు తెలుసు!"

"అంటే యిరవై నాలుగు గంటలూ నా ధ్యాసలోనే ఉన్నావన్న మాట... థాంక్యూ సునీతా!... థాంక్యూ!"

"వారం అయింది ఫోను చేసి... అంత బిజీనా?"

"బిజీనే... నీకోసమే బిజీ!... పగలంతా ఆఫీసు... ఆ తరువాత నీ ఉద్యోగానికి గాను వాళ్ళనూ వీళ్ళనూ కలవటం... ఓకే! ఓకే... కష్టపడితేనేం ఫలితం దక్కింది... యూ ఆర్ సెలెక్టెడ్... నీకు ఉద్యోగం వచ్చినట్లే! రెండు మూడు రోజుల్లో ఫోనులో ఇంటర్వ్యూ ఉంటుంది... అది జస్ట్ ఫార్మాలిటీ... ఆ వెంటనే మా కంపెనీ నుండి నిన్ను ఆహ్వానిస్తూ ఆర్డర్స్ వస్తాయి... సామాన్లు సర్దుకు రెడీగా వుండటమే ఇక నువ్వు చేయాల్సిన పని!"

"అలాగా... అయితే మనకీ ఎడబాటు త్వరలోనే తీరుతున్నదన్న మాట!"

"అదే గదా నా కోరిక గూడా... నీకు ఆర్డర్స్‌రాగానే మామగారిని తీసుకొని మద్రాసు వెళ్ళు వీసాకోసం... టిక్కెట్లు గూడా కొని పంపిస్తాను... రైట్... ఇప్పుడు చెప్పు... నా శక్తి నీకు అర్థమయిందిగదా... రవీంద్ర పట్టు పట్టాడంటే ఉడుంపట్టే... కొండమీద కోతినైనా రాణిగారు కోరిందంటే పళ్ళెంలో పెట్టి నజరానాగా అర్పించేస్తాడు!"

"మొదటి రాత్రే అర్థమయిందిలేండి మీరు మహా మొండి మనిషని!" ఆమె చెంపలు ఎర్రగా కందినయ్. "మీరు ఇంకో ఘనకార్యంగూడా చేశారు... నేను అక్కడకు వచ్చినా ఉద్యోగం చేసేది ఆరునెలలే!" అన్నది మురిపెంగా నవ్వుతూ.

"అదేం?"

"అది అంతే మాష్టారు!"

"సరిగ్గా చెప్పవోయ్!"

"ఐ మిస్సడ్ మై మంత్లీ పీరియడ్స్!"

"వ్హాట్?"

"అదేనండి సారూ... నేను నెల తప్పాను... మీరు తొమ్మిది నెలల్లో తండ్రి కాబోతున్నారు... ఈరోజు ఉదయమే మా డాక్టరు కన్ఫరమ్ చేసింది... ఆమె నవ్వుతూ మిమ్మల్ని ఒక మాట అన్నది గూడా!" పకపకా నవ్వుతూ అన్నది సునీత.

అవతల నుంచి నిశ్శబ్దం.

"నాకు ఈ సందర్భంలో ఏం కొనాలని ఆలోచిస్తున్నారా?"

"నో!" చాలా సీరియస్‌గా అన్నాడు రవీంద్ర. "వెంటనే వెళ్ళి అబార్షన్ చేయించుకో!"

"ఏఁవంటున్నారు మీరు?" ఆ మాట వింటూనే ఉలిక్కి పడ్డట్లుగా అన్నది సునీత.

"యస్... నేను చెప్పింది విని వెంటనే చేయించేసుకో... ఇక్కడకు నువ్వొస్తున్నది పిల్లల్ని కనటానికి కాదు... ఉద్యోగం చేయటానికి... డబ్బు సంపాదించుకోవటానికి... నాలుగు సంవత్సరాలు కష్టపడి చేతనయినంత సంపాదించుకొని ఇండియా వెళ్ళి తీరిగ్గా ఎన్ని సార్లయినా పిల్లల్ని కను... ఐ వెల్‌కం ఇట్!"

సునీతకు నోట మాట పెగల్లేదు.

"అర్థం అయిందా... మళ్ళా మూడ్రోజులకు ఫోను చేస్తాను... అప్పటికి నువ్వు హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చి వుంటావ్... ఓకే!"

"నేను చెప్పేది వింటారా?..." పెద్దగా అరుస్తున్నట్లుగా నోరు తెరవబోయింది.

అప్పటికే ఫోను కట్ అయింది 'క్లిక్'మన్న శబ్దంతో.

* * *

సునీత చేతిలో రిసీవర్ అలాగే ఉన్నది.

...ఏం మనిషి అతడు?

తను తల్లిని కాబోతున్నాను అని చెబితే సంతోషిస్తాడు అనుకున్నది గాని అలా మాట్లాడతాడని అనుకోలేదు.

అంత డబ్బు మనిషా?

ఉన్న అస్తి చాలదా?

సునీత శూన్యంలోకి చూస్తున్నట్లుగా చూస్తూ ఉండిపోయింది. ఆమె బొమ్మలా బిగుసుకు పోయింది.

ఆమె హుషారుగా ఫోనులో మాట్లాడుతుండగా ఆ గదిలోకి వచ్చిన తల్లి కూతురు ఎవరితో మాట్లాడుతున్నదో అర్థం చేసుకొని, నవ్వుకుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయింది.

తరువాత పది నిముషాలకు వచ్చి, "ఏఁవంటున్నాడే మీ ఆయన?" అన్నది.

సునీతకు నోట మాట పెగలటం లేదు. తల్లి ముఖంలోకి అయోమయంగా చూస్తూ ఉండిపోయింది.

"శుభవార్త చెప్పావా?" అన్నది కూతురు దగ్గరికల్లా వచ్చి ఆప్యాయంగా చూస్తూ. "మాట్లాడవేం... ఏంటట్లా దిక్కులు చూస్తావ్?"

"మీ అల్లుడిగారికి ఇప్పుడు తను తండ్రి అవ్వటం ఇష్టం లేదట!" ముఖం చటుక్కున పక్కకు తిప్పుకున్నది.

"అంటే?..." ఆమె నుదురు ముడివేసింది.

"నన్ను అబార్షన్ చేయించుకోమంటున్నారు!"

"హవ్వ! అదేం మాటే!" ఆమె బిగుసుకుపోయింది కూతురు చెప్పిన మాట వింటూనే. "శుభమా అని తల్లివి కాబోతుంటే ఆ అపభ్రంశపు పని చేయటమేమిటి?"

"అది మంచో చెడో... ఆయనకు కావాల్సింది నేను తల్లిని కాకుండా వుండటం... నాలుగు సంవత్సరాలు ఆయన చెప్పినట్లుగా ఉద్యోగం చేసి, డబ్బు సంపాదించి ఆయనకివ్వటం!" చాలా కరుకుగా అన్నది సునీత.

ఆమెకు కోపంతో కళ్ళు ఎర్రబడుతున్నాయి.

ఆయనతో గడిపిన మొదటి రాత్రి గుర్తుకు వచ్చింది. ఆయన మొండితనం గుర్తుకు వచ్చింది.

తనని పాలు త్రాగమన్నాడు... ఆయన సగం త్రాగి గ్లాసు అందిస్తూ...

"వద్దు!" అన్నది తను.

"నేను ఎంగిలి చేశాననా?"

"కాదు!"

"మరి?"

"నేను పాలు త్రాగను... ఒట్టి పాలు నాకు చాలా వెగటుగా వుంటయి!"

"నేను ముందు త్రాగి తీపి కలిపాను గదా!" అన్నాడు నవ్వుతూ తనని పట్టుకొని పక్కన కూర్చోబెట్టుకుంటూ.

"ఎందుకో చిన్నప్పటినుంచీ నాకు అంతే... పాలు త్రాగితే డోకు వస్తుంది!... త్రాగను... అందుకే అమ్మగూడా బలవంతం చేయదు!"

"ఇప్పుడు నువ్వు వినవలసింది అమ్మమాట గాదు... భర్తమాట! భర్త ఏది కోరితే అది చేయాలి!" అన్నాడు.

"నా కిష్టంలేని పనైనానా?" మురిపెంగా అన్నది అతడి లాల్చీ గుండీ సర్దుతూ.

"అవును!"

అధాట్టుగా తలెత్తింది.

"నాకు పాలు త్రాగకుండా వుండే స్వాతంత్ర్యంగూడా లేదా అమ్మా!" అన్నది లాలనగా అతడినే చూస్తూ.

"పెళ్ళయ్యేటంతవరకే నీకా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు... అమ్మను అదిలించి బెదిరించి నీ కోరికలు తీర్చుకోవటాలు. వివాహం అయింతరువాత భర్త ఇష్టాలే నీ ఇష్టాలు అవ్వాలి!"

"అబ్బ... ఏం కాదు!" అన్నది మురిపెంగా అతడి గడ్డం పట్టుకు అటూయిటూ ఊపుతూ.

"అవును! నేను చెప్పేది నిజం... ఇది ఎవరూ కాదనటానికి వీల్లేదు!"

ఆయన లేచి అద్దంలో చూచుకుంటూ నవ్వుతున్న పెదాల మీదగా వున్న సన్నని మీసాన్ని సర్దు కుంటున్నాడు.

బిత్తరపోయింది తను. ఏడుపు వచ్చింది తనకు. కోపంతో వళ్ళు వేడెక్కి పోతోంది.

ఆ కోపాన్నే చల్లబరుచుకోవాలన్నట్లుగా ఒక్క గుటకలో ఆ గ్లాసులో మిగిలిన పాలన్నీ గొంతులో పోసేసుకున్నది. ఉక్కిరి బిక్కిరి అయింది. డోకు వచ్చేంత పని అయింది. చటుక్కున అక్కడ వెండి పళ్ళెంలో వున్న పాన్ తీసుకొని నోట్లో పెట్టుకొని కరకరా నమలసాగింది... అతడి మీద కసిని నమిలేస్తున్నట్లుగా.

నవ్వుకుంటూ ఆయన తన దగ్గరకు వచ్చాడు.

"సారీరా! భర్త మాట వినే భార్య అంటే అలా వుండాలి... ఐ లైక్ యూ... ఐ లైక్ యూ!" దగ్గరకు తీసుకొని గుండెలకు హత్తుకుంటూ ముద్దులు కురిపిస్తుంటే తనకు ఒళ్ళంతా కంపరమెత్తింది.

"ఇంకా దాన్ని మర్చిపోవాలి నువ్వు... నీకు పాలు ఇష్టంలేదని ముందు తెలిస్తే నేను అసలు త్రాగమనే వాడినే కాదు... నేను అన్న తరువాత ఏ పనైనా చేయకపోతే నాకు తిక్కరేగుతుంది, సునీ!... నిన్ను జీవితంలో మరోసారి పాలు త్రాగమని అడగను... ఒకే! నాది మాటంటే మాటే!"

తనకు పెద్ద రిలీఫ్‌గా భావించింది ఆమాటలు. అతడిని పెనవైచుకు పోయింది ఆ క్షణాన... తను ఎంత అల్ప సంతోషో ఇప్పుడు అర్థమవుతున్నది!

"అయితే నువ్వేమన్నావే?" తల్లి దగ్గరకు వచ్చి అన్నది విసురుగా.

"నేను ఏంవీ అనే అవకాశమే లేదు... ఆ మాట చెప్పి ఫోను పెట్టేశాడు... మూడు రోజుల్లోగా ఆ పని జరిగి పోవాలిట!"

"హవ్వ! అంత మొండి మనిషా?... ప్రహ్లాదరావుగారిని పిలుద్దాముందు... ఆయనేగా తన అన్నయ్య కొడుకు అంటూ ఈ సంబంధం తెచ్చింది... ఆయనకు చెప్పి వాళ్ళ అమ్మా నాన్నలను పిలిపించి అడుగుదాం!"

"పాపం ఆయనేం చేస్తారు... తోటి ఉద్యోగిగదా... సాయం చేయాలని నాన్నకు సజస్ట్ చేశారు... ఏదైనా, ఎవరి గుణగణాలు తెలుసుకోవాలన్నా దగ్గరయితేగాని తెలియదు గదా!"

"అయితే నాన్ననే వాళ్ళ దగ్గరకు పంపి మాట్లాడమందాం!"

సునీత పేలవంగా నవ్వింది. "చిన్నపిల్లవాడయితే కోప్పడి చెప్పగలరు... కానీ చెట్టంత కొడుక్కు ఏం చెబుతారు... అయినా వాళ్ళు చెబితే ఆయనగారు వింటారనే నమ్మకమేఁవున్నది!"

"అయితే ఏఁవంటావ్... తీయించేసుకుంటావా?" విసుగ్గా అన్నది సునీత తల్లి.

కొన్ని క్షణాల నిశ్శబ్దమావరించింది అక్కడ.

సునీత దవడలు బిగుసుకుపోయినయి. మెడ నరాలు ఉబికినయి. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"లేదు... నేను అబార్షన్ చేయించుకోను!"

* * *

మూడోరోజు ఉదయం నిద్ర లేచినప్పటినుంచి రవీంద్రనుంచి ఫోను వస్తుందనే ఎదురు చూస్తున్నది సునీత. తనయితే ఓదృఢ నిర్ణయం తీసుకున్న మాట వాస్తవమేగాని దానికి ఆయన స్పందన ఎలా ఉంటుందోనని భయంగా వున్నది. ఆయన అంత తేలిగ్గా దేనినీ అంగీకరించే మనిషి కాదు!

ఆయన అంగీకరించినా, అంగీకరించక పోయినా తను మాత్రం భ్రూణ హత్య చేయదు. అంతగా అయితే డెలివరీ అయింతరువాత అమెరికా వెళుతుంది. తన కడుపులో తన ప్రతిరూపమే ఒక రూపు ఏర్పరుచుకుంటున్నప్పుడు దానిని తన చేతులతోనే విచ్ఛిన్నం చేయలేదు.

ఉదయం నుంచీ అన్యమనస్కంగానే గడిపింది.

సరిగ్గా పదకొండు గంటలకు ఫోను మ్రోగింది. తనకు తెలుసు అది అమెరికానుండే!

తడబడుతున్న చేతి వేళ్ళతో రిసీవర్ ఎత్తింది. "హలో!"

"నేను సునీతా! రవీంద్రను... కులాసానా?.. ఎప్పుడు డిశ్చార్జి అయినావ్?"

"కులాసానే... మీరెలా వున్నారు?"

"ఫైన్‌యార్... హాస్పిటల్‌లో ఏ ఇబ్బందీ కలగలేదు గదా!"

"నేను హాస్పిటల్‌కు వెళ్ళలేదు!" గుండె బిగపట్టుకొని అన్నది.

"అదేం?"

"గర్భస్రావం చేయించుకోవటం నాకిష్టం లేదు!"

"వ్హాట్... ఏఁవంటున్నావ్... నీకిష్టం లేదా?...నేను చేయించుకోమని అంత గట్టిగా చెప్పిన తరువాత గూడా వెళ్ళలేదూ అంటే... నేను చెప్పింది అర్థం కాలేదా?" ఆ కంఠంలో మృదుత్వం కరిగిపోతున్నది.

"చెప్పాను గదా... నా కిష్టంలేక చేయించుకోలేదు!" చిన్నగా గొణుగుతున్నట్లుగా అన్నది సునీత.

"నాన్సెన్స్... నీ యిష్టం ఎవడికి కావాలి బోడి యిష్టం... నేను చెప్పాను నువ్వు చేయించుకోవాలి... దాంతో నువ్వు వచ్చి ఇక్కడ వెలగబెట్టే ఉద్యోగం ఏమున్నది... తిండి దండగ తప్ప!"

సునీత మాట్లాడలేకపోయింది అతడి మాట తీరుకు.

"ఏం మాట్లాడవేం... బుద్ధీ జ్ఞానం ఉన్నయ్యా... మొగుడి మాట వినాలనే ఇంగితం గూడా లేని దానివి అంత చదువు చదివింది దేనికి?"

సునీత మాట్లాడలేదు.

"అయితే నువ్వు ఎవర్నో ఒకర్ని కనేటందుకే ఇక్కడకు వస్తున్నావన్నమాట... నేను ఇక్కడ నీ ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నమంతా వృథానేనా... నో... నువ్వు ఎబార్షన్ చేయించుకు తీరాలి... మళ్ళా మూడు రోజులకు ఫోను చేస్తాను... అప్పటిలోగా చేయించుకోక పోయినావో మర్యాద దక్కదు... నేనేం చేస్తానో నాకే తెలియదు!"

"ఇప్పుడు ఈ పని మీకు తెలియకుండానే చేశారా?" సునీతా కంఠం హెచ్చించి క్రోధంగా అడిగింది.

"మనం కలసి వున్నది మహా అయితే పదిరోజులు... అదీ హనీమూన్ అంటూ సరదాగా గడిపాం కాబట్టి... ఈ పదిరోజుల్లోనే ఇంత ఘనకార్యం నువ్వు చేసేస్తావని నేను కలగన్నానా?" కంఠం తీవ్రంగా వున్నది.

"దానికి బాధ్యులు ఎవరు?... నేనా?మీరా?"

"ఇప్పుడు బాధ్యతలు గూడా నిర్ణయించే స్థితికి వచ్చావన్నమాట... నేను ముందే చెప్పాను నీకు... మనం అమెరికా వెళుతున్నామని, అక్కడ యిద్దరం ఉద్యోగం చేస్తామని... నాలుగేళ్ళు ఏ బాదరబందీ లేకుండా డబ్బు సంపాదించుకొని ఇండియాకు వస్తామని... నాన్నకు వయసు వచ్చింది కాబట్టి, అస్తిపాస్తుల వ్యవహారాలన్నీ ఆపైన మనమే చూచుకోవాలనీ... అంతకు మించి విపులంగా చెప్పాలా?"

"అంటే ఇందులో తప్పు నాదేనంటారు!" ఆమెకు ఒక్కసారిగా దుఃఖం గుండె లోతుల్లోనుంచి వెళ్ళుకొచ్చింది.

మగవాడు ఏ విషయాన్నైనా తనకు అనుకూలంగా ఎట్లాగైనా మలుచుకోగలడు!

"సునీతా... సునీతా... సునీతా... నేనన్నానా ఆమాట... తప్పు ఒప్పుల ప్రసక్తి నేను ఎత్తానా... జరిగింది... అది అనుకోకుండా జరిగిపోయింది... ఓ పొరబాటు జరిగినప్పుడు మనం దానిని సరిదిద్దుకోవాలీ అన్నాను... సరిదిద్దు కోమన్నాను... ఇంత చిన్న విషయానికి గూడా భర్తమాట వినకపోతే ఇంకా మనం ఎన్నో సంవత్సరాలు కలసి మెలసి బ్రతకాలి... మనం బ్రతకగలమంటావా?"

"ఒకళ్ళ మాటకు ఒకళ్ళు గౌరవమిస్తే మనం తప్పకుండా ఆనందంగా బ్రతకగలుగుతాం!"

"అంటే పెళ్ళాం మాట మొగవాడు వినితీరాలనా నీ ఉద్దేశ్యం!"

"ఇద్దరం సమానమనే విషయం గుర్తించాలి అని అంటాను- అంతే!"

"ఛత్! నోర్మూయ్... నేను చెప్పినట్లు వెంటనే ఆసుపత్రికి వెళ్ళు... మరో మాట మాట్లాడావంటే పళ్ళు రాల గొడతాను!" ఫోను పెద్ద శబ్దంతో క్లిక్ మన్నది.

ఇలాంటి మనిషికా నాన్న లక్ష రూపాయిల నజరానాతో తనను అప్పగించింది!

సునీతా రిసీవర్‌ను విసురుగా క్రెడిల్ చేసింది.

"నేను చచ్చినా ఆపని చేయను!"

* * *

రాత్రి ఎనిమిది గంటలప్పుడు డైనింగ్ టేబుల్‌ముందు డిన్నరు తీసుకుంటున్న సమయంలో సునీత అన్నది: "నాన్నా! మనం ఒకసారి మా మామగారింటికి వెళ్ళిరావాలి... ఎప్పుడు వీలవుతుందో చెప్పు నీకు!"

... ఆయనకు మూడు రోజుల క్రితం అల్లుడు దగ్గరనుంచి వచ్చిన ఫోను విషయం భార్య చెప్పింది. అందుకే ఆయనకు కూతురు అత్తగారింటికి ఎందుకు వెళ్దామంటున్నదో వెంటనే అర్థమయింది.

ఆ విషయం భార్య చెప్పినప్పుడు చాలా తేలిగ్గా తీసుకుంటూ, "రోజులు ఎలా మారిపోతున్నయి... ఇదివరకు సీమకు వెళ్ళటం అంటే అదో ఘనత... ఇప్పుడో చదువుకున్నా, చదువుకోక పోయినా ఎవ్వడైనా వెళ్ళాలనుకుంటే వెళ్ళిపోవటమే- మనం ఢిల్లీ వెళ్ళినట్లు... మనుష్యుల ఆలోచనలూ, తీరూ, అలవాట్లూ మారిపోతున్న ఈ కాలంలో నువ్వూ నేనూ చేయగలిగిందేమున్నది... నీకు తెలిసిన లేడీ డాక్టరు ఉన్నది గదా... తీసుకు వెళ్ళి అల్లుడు చెప్పినట్లు చేయించేసేయ్... అతడికి కోపమొస్తే బాగుండదు!" అన్నాడు.

భార్య వెంటనే చెప్పింది: "దానికిష్టంలేదు... తీయించుకునేందుకు!"

"అయితే మొగుడికి సర్ది చెప్పుకోమను... దాని సంసారం బాగోగులు అది చూచుకోవాలి!" అంటూ ఆ విషయాన్ని అంతటితో త్రుంచివేశాడు.

ఇప్పుడు కూతురు అన్నమాటలకు ఆయన తలెత్తి, "ఎందుకమ్మా! వాళ్ళతో మాట్లాడటం అవసరమా...- నీ కెందు కంత మొండితనం... అబ్బాయి మాట వింటే సరిపోతుంది గదా!" అన్నాడు.

... ఏ గొడవా లేకుండా కూతురు సంసారం సాఫీగా నడవాలనేదే ఆయన కోరిక!

తండ్రి మాటకు అవాక్కయింది సునీత.

భర్త అంతకుముందు అన్నమాటలను తల్లి కూతురుకు చెప్పకపోవటంతో ఇప్పుడు తండ్రి మాటలు సునీతకు షాక్‌లా తగిలినయి!

...మగవాళ్ళంతా ఇంతేనా?

"నా యిష్టాయిష్టాల ప్రసక్తే లేదా నాన్నా?" చాలా బేలగా అడిగింది.

"మొగుడి ఇష్టమే భార్య ఇష్టమవ్వాలి... మన కుటుంబంలో ఎప్పుడైనా కలతలు రావటం గమనించావా... అమ్మకు నేనెంత చెబితే అంత!"

"స్త్రీకి స్వాతంత్ర్యం ఉండగూడదనా మీ ఉద్దేశ్యం, నాన్నా!"

ఆయన నవ్వాడు: "ఇవన్నీ పుస్తకాలలల్లో చదవటానికి బాగుంటయ్యమ్మా! మనం సుఖంగా ఎలా ఉండగలుగుతాం అనేది మనం నిర్ణయించుకోవాలి... మొగుడూ, పెళ్ళాలూ ఒక మాట మీద ఉంటే ఆ ఇల్లు స్వర్గమే!"

"నేనూ అనేది అదే!"

"అభిప్రాయభేదమొచ్చినప్పుడు మొగవాడి మాటే చెల్లుబాటు చేస్తే సరి... ఇక పేచీయే వుండదు!"

సునీత గుండె కలుక్కుమన్నది ఆ మాటకు. ముఖం చిన్నబుచ్చుకున్నది.

"పోనీయ్‌లే నాన్నా! నీకు రావటం ఇష్టం లేకపోతే నేను ఒక్కదాన్నే వెళ్ళి వస్తా... వాళ్ళు కొత్త మనుష్యులు, పరాయి వాళ్ళేం కాదుగదా... నాకు మామగారు, అత్తగారు!"

ఆయనకు కూతురుకు కోపమొచ్చిందని అర్థమయింది.

"అది గాదమ్మా..." అనునయించ బోయారు.

"ఇక ఆ విషయం వదిలేద్దాం నాన్నా! మీ అభిప్రాయం తెలుసుకున్న తరువాత ఇంకా దాన్ని పట్టుకు పీకటం నా కిష్టం లేదు!" కంచం ముందు నుంచి లేచి వెళ్ళి చేయి కడుక్కున్నది సునీత.

* * *

"ఏంవమ్మా సునీతా! బాగున్నావా... అంతా ఒక ఊళ్ళో ఉన్నామన్న పేరేగాని మీదో మూల మాదో మూల... రాత్రే మామయ్యగారు అంటున్నారు... కోడల్ని తీసుకు వచ్చి అమెరికా వెళ్ళేటంతవరకూ ఇక్కడే ఉంచుకుందామని... రేపో ఎల్లుండో మీ యింటికి వచ్చి అమ్మా నాన్నకు చెబుదామనుకుంటున్నాం!" అన్నది అత్తగారు.

సునీత నవ్వేసి ఊరుకున్నది.

"ఆయనేమన్నా ఫోను చేశారా మీకు?"

"లేదమ్మా! ఏంవన్నా విశేషముందా?... నీకు ఆర్డర్సు గాని వస్తున్నయ్యా ఏంవిటి?" అన్నారు మామగారు.

ఆయనకా విషయం చెప్పటానికి బిడియపడింది సునీత.

అత్తగారు లేచి, "కూర్చో అమ్మా! మంచినీళ్ళు తెస్తాను... ముందు త్రాగు... ఎట్లా వచ్చావ్?... ఆటోలోనేనా?" అన్నది.

"మీరు కూర్చోండి అత్తయ్యగారూ! మీరు నాకు ఇవ్వటమేంవిటి... నేను తీసుకు త్రాగుతాను... టీ పెట్టేదా?... ముగ్గురం త్రాగుతూ ఖబుర్లు చెప్పుకోవచ్చు!" అంటూ చొరవగా వంటయింట్లోకి వెళ్ళింది.

వెనగ్గా వచ్చిన అత్తగారిని అక్కడే పీటవేసి కూర్చోబెట్టి, తను మంచి నీళ్ళు త్రాగి, స్టౌ మీద పాలు పడేసి సిమ్‌లో పెట్టింది. వెళ్ళి అత్తగారి పక్కన కూర్చుంటూ సూటిగా అసలు విషయంలోకి వెళ్ళిపోయింది.

పాలు కాగినట్లనిపించగా లేస్తూ, "ఇదండీ అత్తయ్యగారూ! ఆయన అభిప్రాయం అది... నా అభిప్రాయం ఇది... మీరూ మామగారూ గూడా ఏంవంటారో కనుక్కుందామని వచ్చాను... అవునూ, మీ యిద్దరికీ వంటయిందా... లేక పోతే ముగ్గురికి కలసి అన్నం పడేస్తాను!" అన్నది కాగిన పాలల్లో టీ పొడి వేస్తూ.

ఆమె నోట మాటరాని దానిలా బిగుసుకుపోయి కూర్చున్నది కోడలి వంక చూస్తూ ఆమె చెప్పిన మాటలు విన్న తరువాత. ఒక్కగా నొక్క కొడుకు. అసలు కొడుకును అమెరికా వెళ్ళ వద్దనే అన్నారు వాళ్ళు. "కట్టుకు పోయినంత ఆస్తి వున్నది- ఇంకా అంత దూరం పోయి సంపాదించాలా?" అంటూ ఎంత చెప్పినా కొడుకు వినలేదు.

"మీరు ఖర్చు పెట్టినట్లు చూసి చూసి ఖర్చుపెడితే అది కట్టుకు పోయినంతే- నేనూ, మా ఆవిడా, మా పిల్లలూ కొత్త ప్రపంచంలో కాలు పెట్టి ఖర్చు పెట్టటం మొదలు పెడితే మీరు మిగిల్చేది మాకు బోడి పిడికెడంత అవుతుంది... మీరు ఏ రోగం లేకుండా పోతే కొద్ది లక్షలు మాకు దక్కవచ్చు... మిమ్మల్ని చివరచివరకు ఏ హాస్పిటల్లోనో చేర్చాల్సి వస్తే మాకు మిగిలేది చిప్పే... మీరు ఈ విషయంలో కల్పించుకోవద్దు!" నిర్మొహమాటంగా చెప్పేసి వెళ్ళిపోయాడు అమెరికాకు కొడుకు.

"వాడు చాలా మొండివాడు... ఎవరి మాటా వింటాడని నాకు నమ్మకం లేదమ్మా... తండ్రి కాబోతుంటే సంతోషించాల్సింది బోయి ఆ అప్రాచ్యపు పని చేయమంటాడా!... బుద్ధీ జ్ఞానం ఉండే మాట్లాడుతున్నాడా... కాదంటే ఒక సంవత్సరం ఆగి నిన్నూ ఆ పుట్టబోయే వాళ్ళను తీసుకు వెళ్ళవచ్చు... గట్టిగా చెప్పలా వాడికి!" ఆమె కోపంగా అన్నదే గాని ఈ విషయంలో కొడుక్కు తాము చెబుతామని అనలేదు.

ఆమెమాట తీరు అర్థం చేసుకున్నది సునీత. వాళ్ళూ అసహాయులేనని తెలుసుకున్నది. సాయంత్రం దాకా వుండి ఇంటికి బయిల్దేరుతూ, "సరే వస్తాను అత్తయ్యగారూ! మీకు ఆయన ఫోనుచేస్తే మీరు చెప్పటానికి ప్రయత్నించండి నా ఉద్దేశ్యాన్ని, మీ ఉద్దేశ్యాన్నీ.. కాదంటే అప్పుడేం చేయాలో ఆలోచిద్దాం!" అన్నది సునీత.

మామగారు అన్నారు: "ఇక్కడకు వచ్చి కొన్నాళ్ళు ఉండఖాదమ్మా!" అంటూ.

"చూద్దాం లేండి... నేను ఇప్పుడప్పుడే అమెరికా వెళ్ళలేక పోవచ్చు గదా... వీలు చూచుకొని వస్తాను!" అన్నది తన మనస్సులోని మాటలు గూడా మరోసారి వాళ్ళకు గుర్తు చేస్తున్నట్లుగా.

* * *

సరిగ్గా అయిదు రోజులకు రవీంద్ర ఫోను చేశాడు.

ఫోనెత్తిన సునీత కంఠం వింటూనే, "ఇప్పటికయినా ఆ పని చేయించావా లేదా?" అన్నాడు విసురుగా.

"నాకు ఆరోగ్యం బాగా లేదు!"

"ఏమైంది?"

"లేచినప్పటినుండీ తలతిరగటం... వాంతులూ!"

"సరిసరి... మీ కుటుంబంలో ఈ అనవాయితీ గూడా వున్నదా?... అది పోతే ఈ ఇబ్బందులుగూడా పోతయి గదా... దానికదే మందు... నీకు అపాయింట్‌మెంటు ఆర్డర్స్ తయారవుతున్నయి!" అన్నాడు రవీంద్ర.

"నేను ఇప్పుడు అక్కడకు రాలేకపోవచ్చు!"

"నువ్వు వస్తానన్నప్పుడు ఆ అవకాశాన్ని బంగారు పళ్ళెంలో పెట్టి నీ ముందు ఎవరూ ఉంచరు!" ఎగతాళిగా అన్నాడు.

"మీరు నన్ను అర్థం చేసుకోలేరా?"

"నువ్వు నన్ను అర్థం చేసుకునే మాట్లాడుతున్నావా?" కోపంగా అడిగాడు.

"నేను చెప్పేది వింటారా?"

"వింటానికేగదా ఇంత డబ్బు తగలేసి ఫోను చేస్తున్నది!"

"నేను అబార్షన్ చేయించుకోను!"

"మరోసారి ఆ మాట మాట్లాడావంటే చెప్పిడిచి మరీ కొడతాను!" కరుకుగా అరుస్తున్నట్లుగా అన్నాడు.

"నన్ను మీరు చెప్పుతో కొట్టాలీ అంటే చాలా డాలర్లు ఖర్చు పెట్ట వలసి వస్తుంది!" కసిగా అన్నది.

"ఏడ్చావులే బోడి జోకు... నోర్మూసుకొని చెప్పినట్లు చేయి... ఎయిర్ టిక్కెట్లు తీసుకొని కావాల్సిన కాగితాలతో పాటు పంపిస్తాను... మద్రాసు వెళ్ళి ఆ వీసా తెచ్చుకొని ఇక్కడకు తగలడు... నన్ను అనవసరంగా రెచ్చగొట్టబోకు!"

"నేనేం రెచ్చగొట్టటం లేదు... మీరే రెచ్చిపోతున్నారు... అబార్షన్ అప్పుడు అనుకోనిది ఏదైనా జరిగితే మీరేం చేస్తారు?" అతడి వంటికి కారం పూస్తున్నట్లుగా మరో బాణం వదిలింది.

"రోడ్డు పక్కన మంత్రసానితో చేయించుకుంటే ఏమైనా అవుతుంది... మంచి డాక్టరు దగ్గరకు వెళ్ళి చేయించుకో... ఆ మాత్రపు ఖర్చుకే మీనాన్న ఆస్తి ఏం తరిగిపోదులే!"

"దానివలన దురదృష్టవశాత్తు మనకిక పిల్లలు పుట్టకపోతే!"

"అలా జరగదు!"

"ఏంవిటి గ్యారంటీ?"

"చెప్పిన మాట వినకుండా మొండిగా వాదనకు దిగి కాలయాపన చేయాలనేనా నీ ఉద్దేశ్యం!"

"కాదు!... ఈసారికి నన్ను కననివ్వండి... మరోసారి అలా కాకుండా జాగ్రత్తలు తీసుకుందాం!"

"నోనోనో..."

"పుట్టిన వాళ్ళను బామ్మదగ్గరో, అమ్మమ్మ దగ్గరో వుంచి వస్తాను... అక్కడ మనకు ఇబ్బంది అవుతుందీ అనుకుంటే!"

"నా పిల్లలు అనాథలుగా మరొకరి చేతుల్లో పెరగటం నాకిష్టం లేదు!" అంతకంటే అతడికి భార్య తన మాట వినటంలేదనేది చాలా మంటగా వున్నది.

"వాళ్ళు రూపు దిద్దుకుంటుండగానే చంపేయటం మీకిష్టమా?" పెద్దగా అరిచింది. ఆమె కంఠంలో కోపమున్నది. కసి వున్నది. దుఃఖం వున్నది. "నో... నేనాపని చేయను...!"

"ఇదేనా నీ ఆఖరి మాట!"

"అవును!" ఫోను పెట్టేసింది విసురుగా.

మంచం మీద బోర్లాపడి వెక్కివెక్కి ఏడ్వసాగింది సునీత.

కొద్ది రోజుల క్రితం పెళ్ళిరోజున ఎన్ని కలలు కన్నది. తన బ్రతుకు మరో స్వర్గంలో కాలు పెడుతున్నట్లుగా భావించి బంగారు ఊయల్లో ఊగిపోయింది.

కాని ఇంత త్వరలోనే ఇలాంటి గడ్డు సమస్య వస్తుందని ఊహించనేలేదు!

తనుగాని తప్పు చేస్తున్నదా?

– మనిషిలో అంతర్మథనం మొదలయింది....

* * *

"నో... నో... నో... ఇది నేను సహించలేను... ఇది నాకు సమ్మతం కాదు!" చేతిలోని పేపర్‌ను విసిరికొట్టింది సునీత ఎదురుగ్గావున్న టీపాయ్ మీద.

ఆయన చెప్పిన మాట వినితీరాలా? తనకు వ్యక్తిత్వం అంటూ లేదా? అది మంచి విషయమైతే తను తప్పకుండా వినివుండేది... కానీ... ఇది... ఇది... ఏంవిటా నిరంకుశత్వం?...

ఇప్పుడు ఆయన చెప్పినట్లు విని తన ఆరోగ్యం పాడయితే, తను ఉద్యోగం చేయలేకపోతే, తన డబ్బు సంపాదించలేకపోతే?....

కాదూ...

రేపు నాలుగేళ్ళయినా ఆయన్ను ఆ ధనపిశాచి వదులుతుందనే నమ్మకమేంవిటి?...

మనకు అసలు పిల్లలే అఖ్ఖర్లేదంటే?

వాళ్ళను పెంచి డబ్బు ఖర్చు పెట్టటం దండగంటే?

కని పెంచిన తల్లి దండ్రుల మాటల్నే విననప్పుడు నిన్న గాక మొన్న ఆయన జీవితంలో ప్రవేశించిన తన మాటకు విలువ ఇస్తాడనే నమ్మకమేంవిటి?

పన్నెండు గంటలప్పుడు తల్లి ఎదురుగ్గా కూర్చొని భోజనం చేస్తున్నప్పుడు సునీత అన్నది: "నేను ఎమ్.సి.ఎ లో జేరతానమ్మా!"

"అదేంవిటి... ఆయన దగ్గరకు అమెరికా వెళ్ళవా?"

"ఈ కడుపేసుకొని ఇప్పుడు వెళ్ళినా, రేపు కన్నవాళ్ళను చంకనేసుకు వెళ్ళినా ఆయన నన్ను కాల్చి చంపేస్తాడు... నేను వెళ్ళదలుచుకోలేదు. మీరు లక్షపోసి తెచ్చుకున్న అమెరికా అల్లుడి మాట వినకుండా కడుపు తీయించుకోకపోవటం... ఆపైన ఏ పిల్లనో, పిల్లవాడినో కనటం మీకిష్టం లేకపోతే చెప్పండి... చేతిలో ఓ బోడి పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ వున్నదిగదా... నా ఆకలి తీర్చే ఉద్యోగం రాకపోదు... అది చేసుకుంటూ ఏ యీవినింగ్ కాలేజీలోనో, ఎక్స్టర్నల్‌గానో ఆకోర్సు పూర్తి చేసుకుంటాను... మీరు ఎలా అంటే అలా... నా మూలకంగా మీరు ఇబ్బందులు పడవద్దు, మనస్తాపం చెందవద్దు!"

కూతురి మాటలకు తల్లి అవాక్కె అయింది!

* * *

పదిహేను రోజుల తరువాత ఒకరోజు ఉదయాన సునీత యూనివర్శిటీకి వెళ్ళి ఎమ్‌సిఏ అప్లికేషన్ తెచ్చుకునేటందుకుగాను తయారవుతుండగా ఫోను మ్రోగింది.

అంతకు నాలుగురోజుల క్రితం రవీంద్ర పనిచేసే కంపెనీ నుంచి తనకు ఉద్యోగం ఇస్తున్నట్లుగా ఆర్డర్సు వచ్చినయి. ఆ కవరును చూస్తూనే విసిరి అలమార్లో మూల పడేసింది.

ఫోను ఎత్తింది సునీత.

ఆయన కంఠం వింటూనే, "చెప్పండి!" అన్నది సూటిగా.

"నీమొండి తనం వలన నేను ఎలాంటి నిర్ణయం తీసుకోవలసి వస్తున్నదో నీకు తెలుసా?" అన్నాడు బెదిరిస్తున్నట్లుగా రవీంద్ర.

"చెప్పండి... ఊహాగానాలతో నా బుర్ర పాడు చేసుకోవటం నాకిష్టం లేదు!"

"నేను విడాకులు ఇద్దామనుకుంటున్నాను నీకు!"

ఆ మాటకు గుండె లోతుల్లోనుంచి దుఃఖం లావాలా వెళ్ళుకొస్తున్నా, పంటి బిగువున ఆపుకొని పకపకా నవ్వింది.

"ఇది మరీ చోద్యంగా వున్నది... నేను మిమ్మల్ని లక్ష రూపాయలు పెట్టి కొనుక్కున్నాను... అలాంటి దేదైనా చేయాలి అనుకుంటే నేను చేయగలను గాని మీరు చేయలేరు!"

ఆమె సమాధానానికి రవీంద్ర ఆవేశాన్ని ఆపుకోలేకపోయాడు: "తప్పుదు ముండ! నా జీవితాన్ని నాశనం చేసింది గాక ఇంకా మాట్లాడుతున్నావా?" పెద్దగా అరిచాడు ఉక్రోషంతో.

మరోసారి నవ్వింది. "నేను నాశనం చేయలేదు... మీ జీవితాన్ని మీరే నాశనం చేసుకుంటూ నా జీవితాన్ని నాశనం చేస్తున్నారు... అవునూ– చెప్పేదయిపోయిందా ఇంకా ఏ౦వైనా వున్నదా... నేను బయిటకు వెళుతున్నాను!"

"అంత కొవ్వెక్కిన దానివి మాయింటికి ఎందుకు ఏడుస్తూ వెళ్ళావ్!... మా అమ్మా నాన్నా రికమండేషన్ కోసమా?"

"నా కొనుక్కున్న మొగుడి ఇల్లు నాదే అవుతుంది గనుక వెళ్ళాను... నేను ఏడుస్తూ వెళ్ళలేదు... కన్నవాళ్ళయినా మీకు కాస్తంత హితబోధ చేసి మిమ్మల్ని సరైన దారిలో పెడతారేమోననే ఆశతో వెళ్ళాను... బై... మీరు నాతో ఏదైనా మాట్లాడాలి అనుకుంటే ఆదివారం నాడే చేయండి... నాకు ఆరోజే వీలవుతుంది!" ఫోను పెట్టేసింది విసురుగా సునీత.

ఆమెకు యూనివర్శిటీకి పోయే మూడ్ పోయింది. కనులు ధారాపాతంగా వర్షిస్తుండగా మంచంమీద పడిపోయింది.

* * *

అర్ధరాత్రి పన్నెండు గంటలయినా నిద్ర పట్టలేదు.

– ఏ౦విటి ఈ సమస్యకు పరిష్కారం?

ఆయన కోరినట్లు గర్భస్రావం చేయించుకొని అమెరికా వెళ్ళి ఉద్యోగంలో జేరి డబ్బు సంపాదించి ఆయన దోసిటలో పోయటమా?

తిరగబడి ఓ పిల్లనో, పిల్లవాడినో కని, ఇండియాలోనే భర్త వదిలేసిన ఆడదానిలా పడి వుండటమా?

ఆమెకు తల తిరిగిపోతున్నది.

ఏలాంటి విషవలయంలో చిక్కుకున్నదీ తను?

ఆయన మాటలు చూస్తుంటే తన వివాహ జీవితాన్ని విడాకులతో కత్తిరించేలా వున్నాడు... అంతటి ఘనుడు గూడా!

ఆమెకు చటుక్కున ఓ మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

మనస్సంతా దాని చుట్టూ పరిభ్రమిస్తుండగా కళ్ళు మూసుకున్నది. మగత నిద్రలోనే తెల్లవారింది.

మంచం మీద నుంచి లేస్తూనే ఫోను తీసుకొని మామగారి నంబరు నొక్కింది.

ఆయన లైనులోకి రాగానే, "నేను సునీతను మామయ్యగారూ!" అన్నది.

"చెప్పమ్మా!"

"నేను మీ దగ్గరకు వచ్చి వుందామనుకుంటున్నాను!"

"ఈ వయస్సులో మాకు అంతకంటే కావాల్సిందేమున్నదమ్మా! సంతోషం... నీ నిర్ణయం చాలా బాగున్నదమ్మా!"

– తన భర్త తను కాపురానికి రమ్మనమన్నా రావటంలేదనే మిషతో విడాకులివ్వలేడు ఇక!

* * *

రెండు రోజుల తరువాత రాత్రి పన్నెండు గంటలప్పుడు ఫోను వస్తే మామగారు పిలిచారు."అబ్బాయి మాట్లాడతాడట నీతో... ఒకసారి రా అమ్మా!" అన్నారు.

సునీత అయిష్టంగానే ఫోను దగ్గరకు వెళ్ళింది.

"ఏంవిటి? నా కొంపమీద పడి తింటున్నావట... మీ వాళ్ళు తిండి గూడా పెట్టమన్నారా?" అన్నాడు ఎగతాళిగా రవీంద్ర.

"కాదు... కొడుకు వదిలేసిన ముసలి తల్లిదండ్రులకు కోడలిగానైనా తోడు వుందామని... అయినా నాకు తెలియక అడుగుతాను మీరు లక్ష రూపాయలు మా నాన్న దగ్గరనుంచి తీసుకున్నది నాకు జీవితాంతం తిండి పెట్టటానికి కాదా?"

"నోర్ముయ్! ఇచ్చాడులే మీ నాన్న జోడి లక్షరూపాయలు... ఇక్కడున్న నా స్నేహితులంతా అయిదారు లక్షలకు తక్కువ తీసుకోలేదు... నీ అందం లాగానే నీ మనస్సూ బాగుంటుందని నేను మోసపోయాను!"

"నా మనస్సుకేమైందిట?"

"మొగుడు మాటలు వినని ఆడదానికి పుట్టగతులుండవ్... అది గుర్తుంచుకో!"

"హత్యలు చేసే మొగవాడికీ అదే ఫలితమని మీరూ గుర్తుంచుకోండి!"

"రాక్షసి! నా జీవితంలో నిప్పులు పోశావే! నేను దీన్ని భరించలేను... చూస్తూ ఊరుకోలేను... విడాకులకు కాగితాలు సంతకాలు పెట్టి పంపిస్తున్నాను... నువ్వూ సంతకం పెడితే ఇద్దరికీ అంగీకారమేనని త్వరలో నాకు విముక్తిని ప్రసాదిస్తుంది న్యాయస్థానం!"

"పెట్టకపోతే?"

"నేనిక్కడ వుండే నిన్ను అక్కడ కాల్చి బూడిద చేయిస్తాను!" ఫోను పెట్టేసిన శబ్దమయింది.

విసురుగా సునీతా ఫోను పడేసి వెనక్కు తిరిగితే...

అత్తగారు, మామగారు అక్కడ కన్నీరు కారుస్తూ నిలబడి వున్నారు!

* * *

ఆ సాయంత్రం తల్లీదండ్రీ వచ్చారు కూతుర్ని చూడటానికి.

అప్పుడే సునీత అత్తగారింటికి వచ్చి మూడు నెలలయింది.

కూతుర్ని చూస్తూనే బావురుమన్నది ఆమె. వియ్యంకుడినీ వియ్యపురాలినీ గూడా తప్పు పట్టేందుకు వీల్లేకుండా వాళ్ళను కదిలిస్తే చాలు కంటనీరు పెట్టుకుంటున్నారు.

అప్పటికి రవీంద్ర పంపిన విడాకుల కాగితాలు వచ్చి పదుహేను రోజులయింది. సునీత వాటిని చూస్తూనే విసిరి పాత గుడ్డలు పడేసిన అలమరలో పారేసింది.

రవీంద్ర ఎన్నిసార్లు ఫోను చేసినా సునీత మాట్లాడలేదు. మామగారికి గూడా చెప్పింది– ఆయన ఫోను చేసి పిలిచినా తను ఇంట్లోలేనని చెప్పమని!

ఒకరోజు రవీంద్ర అర్ధరాత్రి పన్నెండు గంటలప్పుడు ఫోను చేశాడు.

తండ్రి ఎత్తాడు.

"సునీతను పిలు నాన్నా! ఇప్పుడయినా ఉన్నదా ఇంట్లో...లేకపోతే ఎక్కడైనా బలాదూరు తిరగటానికి వెళ్ళిందా?"

ఆయన వచ్చి సునీతకు చెప్పాడు ఇక తప్పక. సునీత నిద్ర పట్టక మంచంమీద అటూ యిటూ పొర్లుతున్నది. విసురుగా వచ్చింది ఫోను దగ్గరకు.

"చెప్పదలుచుకున్నదేదో తొందరగా చెబితే పడుకొని హాయిగా నిద్రన్నాపోతాను!"

"నీవేం మాట్లాడుతున్నావో నీకు అర్థమవుతున్నదా?"

"ఇంకా పిచ్చెక్కలేదు... ఎక్కినా చేయగలిగిందేమీ లేదు!"

"కాగితాలు ఎందుకు పంపలేదు?.... నేను లాయరుకు పంపాలి... పోనీయ్ ఆయన్ను వచ్చి నీ దగ్గర తీసుకోమని చెప్పేదా?"

"నేను సంతకం పెట్టే ప్రసక్తే లేదు... మీ లాయరును అడగండి... నా అంగీకారం లేకపోయినా విడాకులు వచ్చేటందుకు ఎన్ని దారులున్నయ్యో చెబుతాడు... ఏదో ఒకటి ఎన్నుకోండి... మీరు విడాకులు ఇచ్చేముందు ఒకటి గుర్తుంచుకోండి... నాకు మనోవర్తి రావాలి... అపైన ఇక్కడ ఉన్న ఆస్తి ఏదీ మీ స్వార్జితం కాదు... అదంతా నాకు పుట్టబోయే వాళ్ళకే చెందుతుంది... ఇక మీ యిష్టం మీరేం చేసినా సరే... కొద్దిరోజులయినా మీకు భార్యగా మీతో కాపురం చేశానుగదా... అందుకే చెబుతున్నాను... గుడ్‌లక్!"

"యూ బిచ్..."

"ఏమన్నారు... మొగుడు దగ్గర కొద్ది రోజులు పడుకున్నందుకే నేను బిచ్‌నయితే... మీలాంటి మొగవాళ్ళను ఏమనాలో ఏ మేధావికీ అంతు పట్టదు... థాంక్యూ వెరీమచ్!" కసిగా ఫోను పెట్టేసి తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆమె కళ్ళు ఆక్షణాన ఎండాకాలంలో నడి ఆకాశాన వున్న సూర్యుడిలా మండిపోతున్నాయి!

తల్లి అడిగింది వచ్చి కూర్చున్న అరగంటకు: "అల్లుడు ఫోను చేస్తున్నాడా?"

"ఏమని?"

"నీ పొగరు తగ్గితేనేగాని నీ సంసారం బాగుపడదే!" అన్నది కోపంగా తల్లి.

"ఆయనగారు చెప్పినట్లు డాన్సు చేయకపోవటం పొగరా?"

"కాక!"

"నన్ను కన్న తల్లిదండ్రులకంటే, నిన్న గాక మొన్న వచ్చిన అత్తగారు మామగారే నన్ను అర్థం చేసుకున్నారు గదే!" అన్నది ఎగతాళిగా నవ్వుతూ సునీత.

"నీ సంసారం నాశనమయితే వాళ్ళకేంవిటి బాధ... నువ్వు గాకపోతే మరో కోడలు వస్తుంది!"

"అమ్మా! నేను ఒక్కటి చెబుతాను విను... నువ్వుగాని, నాన్నగాని మీ అల్లుడి విషయం ఎత్తకుండా నన్ను చూడాలనుకుంటే ఇక్కడకు రండి... వచ్చి మాత్రం నా బుర్ర తినవద్దు... ఇప్పటికే నేను సగం చచ్చి వున్నాను... పూర్తిగా చంపవద్దు!" అన్నది రెండు చేతులూ జోడించి.

సునీత తల్లికి నోట మాట పెగల్లేదు. శిలలా ఆలాగే కూర్చుండి పోయింది!

'దీన్ది బాగుపడే లక్షణం కాదు!' అనుకున్నది మనస్సులోనే క్రోధంగా.

* * *

మామగారికి జ్వరం వస్తే డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళి ఇంటికి వచ్చేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది. ఏ డాక్టరు దగ్గరకు వెళ్ళినా జనం కిటకిటలాడుతున్నారు. గంటకు పైగా కూర్చుంటేగాని తమ వంతు రాలేదు.

అన్నం తినేటప్పటికి పదయింది. అన్నీ సర్ది మంచంమీద జేరేటప్పటికి పదకొండు.

పడుకుంటే ఇబ్బందిగా వున్నట్లనిపించింది. అటూయిటూ దొర్లుతోంది. కడుపులో నొప్పిగా వున్నట్లనిపిస్తోంది. ఆలస్యంగా భోజనం చేయటం వలననేమోనన్నట్లుగా ఓర్చుకుంటూ పడుకున్నది. ఎంత సేపటికీ తగ్గకపోగా ఇంకా ఎక్కువవ్వసాగినయి పోట్లు.

అత్తగారిని లేపి చెప్పింది.

ఆమె ఆదుర్దాపడుతూ, "ఇంట్లో పనంతా నెత్తినవేసుకు చేస్తావ్... ఒట్టి మనిషివికావు జాగ్రత్తగా వుండమ్మా అంటే వినవు... వేడి చేసిందేమో పేరునెయ్యి రాస్తానుండు!" అంటూనే ఇంత నెయ్యి తెచ్చి మంచం మీద కోడలి పక్కన కూర్చొని కడుపు మీద రాయసాగింది చిన్నగా. "రేపు కాన్పు అయ్యేటంతవరకూ ఈ చిన్న చిన్న ఇబ్బందులు తప్పవు... నువ్వు రెస్టు తీసుకోవాలి... నా మాట విను... వంటమనిషిని పెట్టుకుందాం!"

సునీత అంత బాధలోనూ నవ్వి వూరుకున్నది.

తరువాత అరగంటయినా తగ్గలేదు. "కాస్త పంచదార, నీళ్ళు కలిపి ఇస్తానుండు... అమ్మకు గూడా ఫోను చేస్తాను!" అంటూ లేచింది ఆమె.

ఆమె పెద్దది. ఆమె ఖంగారు ఆమెది.

"వద్దండీ... అనవసరంగా వాళ్ళు గాభరా పడతారు... కాసేపు వుంటే అదే తగ్గిపోతుంది లేండి!"

"పోనీయ్ పై ఆంటీని లేపేదా... డాక్టరు దగ్గరకు వెళ్దాం!" అంటూ బయిటకు వెళ్ళి మేడమీద అద్దెకున్న ఆమెను బెల్లు కొట్టి పిలిచింది. ఆమె దిగుతూనే పరిస్థితి అర్థం చేసుకొని మొగుణ్ణి లేపి కారు బయిటకు తీయించింది.

అందరూ కలసి దగ్గరిలోనే వున్న నర్సింగ్‌హోంకు వెళ్ళారు. దాన్ని ఆనుకొని వున్న ఇంట్లోనే డాక్టరు వుంటాడు. ఆయన భార్య గైనకాలజిస్టు.

ఆమె సునీత పడుతున్న బాధను చూస్తూనే లేబర్ రూం లోకి తీసుకువెళ్ళింది.

అందరూ ఆదుర్దాగా ఆ గదిముందు బెంచీల మీద కూర్చున్నారు.

తరువాత అరగంటకు డాక్టరు బయిటకు వస్తూ, "సారీ! అబార్షన్ అయింది!" అన్నది.

* * *

"నో...నో...నో" పెద్దగా అరిచింది సునీత.

ఆమె జుట్టు రేగి తలవైపు అంతా చిందరవందరగా పరుచుకొని వున్నది. పైన ఫ్యాను తిరుగుతున్నా వళ్ళంతా చెమటలతో తడిసి వున్నది. ముఖాన కుంకుమ నుదురంతా అలుముకొని వున్నది.

"అలా అవ్వటానికి వీల్లేదు... ఐ వాంట్ మై చైల్డ్!"

ఆమె ఆవేశంతో మంచం మీద ఊగిపోతున్నది. డాక్టర్ ఆమె భుజం తట్టి సిస్టర్‌ను పిలిచి 'నిద్ర' పోయేటందుకుగాను ఇంజక్షన్ ఇవ్వమన్నది. వెనుదిరుగుతూ, "అమ్మాయికి టెన్షన్స్ ఏమైనా ఉన్నయ్యా?" అడిగింది సునీత అత్తగారిని.

ఆమె మాట్లాడలేకపోయింది. ఏంవని చెబుతుంది?

డాక్టరు ఒక్క క్షణం చూచి వెళ్ళిపోయింది.

సునీత- తనలోని రక్తాన్నంతా ఎవరో పీల్చేస్తున్నట్లుగా విలవిలలాడుతూ చిన్నగా నిద్రలోకి జారిపోయింది.

"వెధవ కడుపు పోతే పోయింది... దాని సంసారమన్నా బాగుపడుతుంది!" అన్నది సునీత తల్లి తెల్లవారుతూనే వియ్యపురాలు ఫోనులో ఆ విషయం చెప్పినప్పుడు.

ఆమె మాటలకు సునీత అత్తగారు ఏంవీ మాట్లాడలేకపోయింది. కోడలుకు మత్తు తగ్గి మెలకువ రాగానే ఏం గొడవ చేస్తుందోనని భయంగా వున్నది. అసలే నీరసంగా వున్నది. ఆవేశంలో ఏం చేసినా తను పట్టుకోవటం కష్ట మవుతుంది.

"ముందు మీరు రండి!" అంటూ నర్సింగ్‌హోం వివరాలు చెప్పి ఫోను పెట్టేసింది- తల్లి దగ్గర వుండటం ఎందుకైనా మంచిది అన్నట్లుగా.

ఎనిమిది అవుతుండగా కళ్ళు తెరిచింది సునీత. ఎదురుగ్గా తల్లిని చూస్తూనే బావురుమన్నది. వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ఆవేశంతో ఆమె గుండెలు ఎగిరెగిరి పడు తున్నాయి.

"నేను ఓడిపోయానమ్మా... నాకు దేవుడు గూడా సహకరించలేదు... నేను ఎప్పుడో ఏదో పాపపు పని చేసి వుంటాను... అందుకే నాకు ఈ శిక్ష!"

* * *

అయిదు రోజుల తరువాత ఓ రోజు ఉదయాన పదకొండు గంటలప్పుడు సునీతకు ఫోను వచ్చింది. అది అమెరికా నుంచి. చేసింది భర్త రవీంద్ర.

సునీత తల్లి కూతురుని కొన్నాళ్ళు తన దగ్గర ఉంచుకుంటానని పుట్టింటికి తీసుకు వెళ్ళింది.

"కాగల కార్యం గంధర్వులే తీర్చటం అంటే ఇదే... ఇప్పుడు మనం భార్యా భర్తలమే కాదు... సరి సమానులం గూడా... నీ మాట నువ్వు నెగ్గించుకున్నావ్... నా మాట నేను నెగ్గించుకున్నాను... రేపు మా డైరక్టర్ కాళ్ళు మరోసారి పట్టుకొని అప్పుడు కోల్డ్‌స్టోరేజ్‌లో పెట్టించిన నీ ఆర్డర్స్‌ని బయిటకు తీయించి, ఎయిర్ టిక్కెట్టుతో సహా నీకు పంపిస్తాను... వెంటనే వచ్చేసేయ్... అరేయ్! నేను చెప్పాను గదా... నేను సామాన్యంగా తెలిసి తప్పు చేయను... కానీ అనుకోకుండా నీ విషయంలో రెండు సార్లు చేశాను... సారీరా! మరోసారి ఆ తప్పు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత నాది... ఎనీహౌ! ఇప్పుడు నాకు చాలా ఆనందంగా వున్నది... నా హృదయపూర్వక అభినందనలు స్వీకరించు!"

సునీతకు రెండు నిముషాలవరకు నోరు పెగల్లేదు అతడి మాటలకు.

"చెప్పరా! ఓ పదిహేను రోజుల్లో నువ్వు పూర్తిగా కోలుకునేలా చూసుకో... మన భవిష్యత్తును డబ్బులో ముంచి తేల్చాలి... ఓకే!"

సునీత నోరు తెరిచింది. "భార్యకు గర్భస్రావమయితే ఆనందిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపే మగవాడికి భార్యగా వుండి నేను కాపురం చేయలేను... నో! మీరు పంపిన విడాకుల కాగితాల మీద సంతకం చేసి పంపుతున్నాను! గుడ్‌బై!" ఫోను పెట్టేసింది సునీత అతడికి మరో మాటకు అవకాశమివ్వకుండా.

* * *

*(విపుల: మాసపత్రిక: మే, 2005)*